## క్లుప్తంగా

### ఆదిత్యుని సన్నిధిలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రమేష్



రమేష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రసాద్ పట్నాయక్

**అరసవల్లి:** అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.వి.రమేష్ కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్ పట్నాయక్, ఆలయ అర్చకులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది చక్రవర్తి, అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ పాల్గొన్నారు.

### ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కల తొలగింపు



ఏఎస్ఎన్‌కాలనీలో పిచ్చిమొక్కలు తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):** 'ఖాళీ స్థలాలు వ్యాధులకు వేదికలు' అనే శీర్షికన ఈ నెల 24న సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. ఏఎస్ఎన్ కాలనీలోని ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కల్ని తొలగించారు. ఈ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు శనివారం పర్యవేక్షించారు. మిగిలిన ఖాళీ స్థలాల యజమానులు కూడా పిచ్చిమొక్కలు తొలగించడం, స్థలం ఎత్తుచేసుకోవడం, ప్రహరీ నిర్మించుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

### మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**శ్రీకాకుళం కల్చరల్ :** నగరంలోని బొంతావారివీధిలో శ్రీకృష్ణార్జున మందిరంలో శ్రావణ మాసం పురస్కరించుకుని శనివారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అమెరికాకు చెందిన మనబాల వెంకట అనంతరవి, నరస వైదర్భిల సహకారంతో 41 మంది మహిళలకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో మిమిక్రీ శ్రీనివాస్, అంధవరపు మురకయ్య తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



విద్యార్థులతో ఎకో క్లబ్ నిర్వాహకులు

**ఎచ్చెర్ల క్యాంపస్:** పర్యావరణ పరిరక్షణ పౌరులందరి సామాజిక బాధ్యతని చిలకపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సీహెచ్ లీలావతి అన్నారు. శనివారం పాఠశాలలో ఎకో క్లబ్ మిషన్ లైఫ్ సమావేశం నిర్వహించారు. పలు కమిటీలను వేసి విద్యార్థులను ఇన్‌చార్జిలుగా నియమించారు. నీరు, వ్యర్థాలు, గాలి, శక్తి, భూమి, ఆరోగ్యం, కాలుష్యం తదితర కమిటీలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లబ్ కన్వీనర్ చావలి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సంతవురిటిలో పశు వైద్య శిబిరం



మూగజీవులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

**జి.సిగడాం:** ఉచిత పశువైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంతవురిటి సర్పంచ్ బుడారి లక్ష్మణరావు కోరారు. శనివారం స్థానిక పశువైద్య కేంద్రంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశముందన్నారు. అనంతరం 286 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### విధులను సక్రమంగానే నిర్వహిస్తున్నా..

**సరుబుజ్జిలి:** విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు అప్పగించిన ప్రతీ పనిని చేస్తున్నానని విజయరాంపురం విద్యుత్ లైన్‌మన్ (ఎనర్జీ అసిస్టెంట్) పెంటయ్య శనివారం తెలిపారు. విజయరాంపురం సర్పంచ్ బెండి అప్పలనాయుడు ఆయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్న వార్తకు స్పందించారు. గ్రామంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు చెప్పిన విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి మరమ్మతులు చేస్తున్నానని తెలిపారు.

# కాలర్ ఎగరేస్తూ.. మెలికలు తిరుగుతూ..!



ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న యువకులు

- శ్రీకాకుళం మహిళా కళాశాల, ఆర్ట్స్ కాలేజీ రోడ్లలో ప్రమాదకరంగా బైక్ స్టంట్లు
- సాయంత్రం వేళ రయ్‌మంటూ దూసుకుపోతున్న యువత
- 80 ఫీట్ రోడ్డులోనూ ఇదే పరిస్థితి
- ప్రమాదాల బారిన పడుతున్న విద్యార్థినులు, సామాన్యులు

**శ్రీకాకుళం క్రైమ్ :**

సాయంత్రం 4 గంటలైతే చాలు ఆ రోడ్లు ప్రమాదకర బైక్ విన్యాసాలకు వేదికగా మారుతున్నాయి. ఎంతమంది హెచ్చరిస్తున్నా, వారిస్తున్నా కొందరు యువత ఏమాత్రం పట్టించుకోకుండా స్టంట్లు, స్కిట్స్‌తో అతివేగంతో ప్రయాణిస్తూ విద్యార్థినులను, సామాన్యులను భయాందోళనకు గురి చేస్తున్నారు. ముఖ్యంగా శ్రీకాకుళం ఉమెన్స్ కాలేజీ రోడ్డు, ఆర్ట్స్ కాలేజీ దారి, 80 ఫీట్ రోడ్లలో టీనేజీ యువత రేసింగ్ మాదిరిగా అతివేగంతో దూసుకుపోతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మూడు రోజుల కిందట ఆర్ట్స్ కళాశాల మార్గంలో చర్చి వద్ద ఇంటర్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఒకే బైక్‌పై వెళ్తూ డిగ్రీ విద్యార్థినిని ఢీకొట్టడంతో ఆమె మృత్యువుతో పోరాడుతోంది.

**మెలికలు తిరుగుతూ డ్రైవింగ్..**

ఉమెన్స్ కాలేజీ రోడ్డులో కళాశాలలు, స్కూలు వదిలే సమయంలో అమ్మాయిల వెంట పడుతూ కొందరు టీనేజీ యువకులు చేస్తున్న సాహసాలు అన్నీ ఇన్నీ కావు. ఒక్కోసారి త్రిబుల్, అంతకు మించి రైడింగ్, చేతులు వదిలేసి కాలరెగరేస్తూ చేయడం, విచిత్ర వేషధారణతో బండిని అష్టవంకరలుగా మెలికల తిప్పుతూ డ్రైవ్ చేయడం వంటివి చేస్తున్నారు.

**ఇలా చేస్తే మేలు..**

- విద్యాసంస్థల ప్రారంభ సమయం ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు, ముగింపు వేళ సాయంత్రం 4:30 నుంచి 5:30 గంటల వరకైనా పరిసర ప్రాంతాల్లో ఎస్ఐ స్థాయి అధికారి బీటు కాస్తే ఆకతాయిల ఆగడాలు కట్టడి చేసినట్లు అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం హోంగార్డునైనా గంట సేపు నిఘా వేస్తేనే ఇలాంటి విన్యాసాలకు అడ్డుకట్ట పడుతుందని చెబుతున్నారు.
- ప్రతిరోజూ ద్విచక్రవాహనాలను ముఖ్యంగా యువత బళ్లను ఆపి లైసెన్స్, ఇన్సూరెన్సు పత్రాలు పరిశీలించి ఒకవేళ నిబంధనలు మీరితే పెద్దలను పిలిచి కఠిన చర్యలు తప్పవని కౌన్సిలింగ్ చేస్తూ హెచ్చరికలు జారీ చేయాలి.
- ముఖ్య కూడళ్లు, మలుపులు వద్ద స్పీడ్ బ్రేకర్లు గానీ, బారికేడ్లు గానీ ఏర్పాటుచేయాలి.

**ఈ దారుల్లో కొన్ని ప్రమాదాలు..**

- గతేడాది డిసెంబరు 25న నలుగురు మైనర్లు ఒకే ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఉమెన్స్ కాలేజీ రోడ్డులో కొండపల్లి పైడితల్లి అనే వృద్ధున్ని అతి వేగంతో ఢీకొట్టి మరణానికి కారణమయ్యారు.
- గతేడాది డిసెంబరులో ఉమెన్స్‌కాలేజీ రోడ్డు మలుపులో స్నేహితునితో కలిసి సరదాగా ద్విచక్ర వాహనంపై వెనక్కి కూర్చొని వెళ్లిన పాపానికి బలగ రాంబాబు (30) అనే యువకుడు తలకు తీవ్రగాయమై మృత్యువాత పడ్డాడు. స్నేహితుడు అతివేగంగా నడుపుతూ మలుపు వద్ద ఒక్కసారిగా సడెన్ బ్రేక్ వేయడంతోనే ఈ ప్రమాదం జరిగింది.
- గతేడాది నవంబరు 23న డేఅండ్‌నైట్ కూడలి గణపతి ఆలయం వద్ద ఎచ్చెర్ల మండలానికి చెందిన మానిక (వీఆర్వోగా పట్టణంలో పనిచేసే సమయంలో) జీబ్రాక్రాసింగ్ దాటుతుండగా యువ బైకర్ ఢీకొనడంతో మెదడుకు గాయమైచికిత్స పొందుతూ మృత్యువాత పడింది.
- సూర్యమహల్ జంక్షన్‌లో ఇద్దరు యువకులు ఎదురెదురుగా బైక్స్‌తో ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యారు.
- 80 ఫీట్ రోడ్డు సమీప వాంబేకాలనీ నారాయణ స్కూల్ సమీపంలో టీటైమ్ షాపునకు వెళ్తున్న గ్యాస్ బండి కళాసీ అప్పన్నను ఓ యువకుడు ద్విచక్రవాహనంతో ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి.



శ్రీకాకుళం ఉమెన్స్ కాలేజ్ రోడ్డులో త్రిబుల్ రైడింగ్ చేస్తున్న యువకులు

**బీట్లు పెంచుతాం..**

ప్రమాద మార్గాలు, విద్యాసంస్థలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఇప్పటికే స్పీడ్ బ్రేకర్లు వేశాం. వీలుంటే బారికేడ్లు కూడా పెడతాం. కళాశాలలు, స్కూళ్లు వదిలే సమయాల్లో లాఅండ్ ఆర్డర్ పోలీసులు బీటు విధులు నిర్వర్తించేలా ఇప్పటికే వారితో మాట్లాడాం. ఎస్పీ కూడా ఈ విషయం సీరియస్‌గా తీసుకుని మాకు ఆదేశాలు జారీ చేశారు.

– ఎం.అవతారం,
సీఐ, ట్రాఫిక్ పీఎస్, శ్రీకాకుళం

## మాజీ ఎమ్మెల్యే కిరణ్ పరామర్శ



అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

**జి.సిగడాం :** మండలంలోని పెంట గ్రామానికి చెందిన సింహాద్రి అప్పారావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పెంట గ్రామంలో ఆయన కుటుంబ సభ్యుడు సింహాద్రి సూర్యనారాయణను పరామర్శించారు. ఈయనతో పాటు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బూరాడ చిన్నారావు, సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, పున్నాన అక్కలనాయుడు, మండల బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం, మండల జేసీఎస్ కన్వీనర్ జోల వెంకటరమణ, నాయకులు శ్రీనివాసరావు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల: లావేరు మండలం కొత్త కుంకాంలో వీఆర్వో దొండపాటి వెంకటమురళీ తల్లి సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కిరణ్ పరామర్శించారు. కార్యక్రమంలో కొత్త కుంకాం ఎంపీటీసీ శివ, నాయకులు ఇసర్ల సూర్యారావు, వాసు, వల్లిరెడ్డి భాను, రమణ తదితరులు పాల్గొన్నారు. అదపాకలో మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గొర్లె అప్పలనాయుడుకు సర్జరీ జరగడంతో ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదపాక సర్పంచ్ గొర్లె శశికళ, నాయకులు నడిమింటి కుమారమ్మ, సునీల్ పాల్గొన్నారు.

## హార్బర్ పనులు పునఃప్రారంభించాలి



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** బుడగట్లపాలెం సముద్రతీరంలో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులను తిరిగి మొదలుపెట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా సర్వే జరిపి హార్బర్ పనులకు అడ్డంకి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తన చాంబర్లో శనివారం మత్స్యశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఆగిపోయిన హార్బర్ పనులను ప్రారంభించి ప్రతి 15 రోజులకు ఒకసారి తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. హార్బర్‌కు ప్రత్యేకంగా రోడ్డు నిర్మించాలని సూచించారు. జిల్లాలో అమలవుతున్న ప్రధానమంత్రి మత్స్య సంపద పథకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మత్స్యశాఖ జేడీ పి.శ్రీనివాసరావు, ఏడీ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## 'మొక్క'వోని దీక్ష



పెదపాడులోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా స్కూల్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం రూరల్

### రిమ్స్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు



రిమ్స్‌లో పనులు చేయిస్తున్న కమిషనర్ చల్ల ఓబులేసు

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):** జిల్లా కేంద్ర ఆసుపత్రిలో శానిటేషన్, తాగునీటి సమస్య ఉండటంతో నగరపాలక సంస్థ కమిషనర్ చల్ల ఓబులేసు శనివారం సందర్శించారు. రోగులు, సహాయకుల కోసం ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్ మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టారు. కాలువలు, పిచ్చిమొక్కలు, చెత్తవేసే ప్రాంతాలను శుభ్రం చేయించారు. రూ.3 కోట్ల నిధులున్నాయని, వాటితో శాశ్వత ప్రాతిపదికన పనులు చేసేందుకు టెండర్లు పిలుస్తామన్నారు. అనంతరం తోటపాలెం రోడ్డుతో పాటు పలు కాలనీల్లో సందర్శించి శానిటేషన్ సమస్య పరిష్కరించారు.

### నైపుణ్యాలను వెలికితీయాలి




మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయ

**నరసన్నపేట:** నైపుణ్యాలను వెలికితీసి, ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తేనే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని ఐతం కళాశాల ఇంగ్లిష్ ప్రొఫెసర్ కె.విజయ అన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో మహిళా సాధికారిత అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. విజయ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తూ ఎందరో మహిళలు చరిత్రలో తమకంటూ ఓ స్థానాన్ని కల్పించుకున్నారన్నారు. అటువంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహిళలు స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అవరోధాలను అధిగమిస్తూ ముందుకు సాగాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ దుదర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రికల్చర్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



వ్యవసాయ జర్నల్స్ విడుదల చేస్తున్న నిర్వాహకులు

**ఎచ్చెర్ల క్యాంపస్:** విద్యార్థులు విషయ పరిజ్ఞానానికి ప్రాధాన్యమిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అరిణాం అక్కివలసకు చెందిన నాగార్జున అగ్రికెం పరిశ్రమ ఉపాధ్యక్షుడు కె.శేషగిరిరావు అన్నారు. సంత సీతారాంపురంలోని సైకి కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌లో శనివారం కాలేజ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజీబీఎస్సీ, ఎంఎస్సీ, పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పని చేస్తూ వ్యవసాయ రంగంలో ఉన్న రైతులకు సేవ చేసే అవకాశం కలుగుతుందన్నారు. 70 శాతం గ్రామీణులు ఇప్పటికీ ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. వ్యవసాయంలో మార్పులకు శ్రీకారం చుట్టాలని, యాజమాన్య ఖర్చులు తగ్గి, లాభసాటిగా వ్యవసాయం మారాలన్నారు. రైతుల్లో పంటల యాజమాన్య పద్ధతులు, అధునాతన వ్యవసాయ సాగు, బిందుసేద్యంపై అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ మోషే, మేనేజ్‌మెంట్ సభ్యులు బి.శ్రీరామ్మూర్తి, బీవీఎస్ఎన్ మూర్తి, కె.దుర్గాశ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, బీఎస్ రాజా, బి.రఘుకార్తీక్, ఐ.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## రణస్థలాన్ని అగ్రపథంలో నడిపిస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు

**రణస్థలం:**

జిల్లాలోనే రణస్థలం మండలాన్ని అగ్రపథంలో నడిపిస్తానని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. రణస్థలం మండల పరిషత్ ప్రాంగణంలో ఎంపీపీ పిన్నింటి రజిని ఆధ్వర్యంలో జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యా వ్యవస్థ అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా పనిచేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో స్త్రీ–శిశు సంక్షేమశాఖ పనితీరుకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావాలన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, రైతన్నలకు సాగు నీరు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తానని చెప్పారు. కొవ్వాడ గ్రామానికి తాగునీటికి రూ.20 లక్షలు మంజూరైట్లు తెలిపారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో మండల ప్రత్యేకాహ్వానితుడు పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల ప్రత్యేకాధికారి బి.దుర్గారావు, ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీనివాసా గోవిందా!




నారాయణ తిరుమలలో వెంకన్నకు పూజలు



చిన్నబజారులో తులసిమాల అలంకరణలో వేంకటేశ్వరుడు

**శ్రీకాకుళం కల్చరల్:** ఫాజుల్‌బాగ్‌పేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. వెంకటరామానుజ సేవాశ్రం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ఈవో శ్యామలరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర స్వామి ఆలయం, మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, డీసీసీబీ కాలనీలోని భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు



**శాకంబరిగా రాజరాజేశ్వరిదేవి**

శ్రీకాకుళం పట్టణంలోని గుడివీధిలో ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో ఆషాఢ మాసం సందర్భంగా రాజరాజేశ్వరీదేవిని శాకంబరిగా శనివారం అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. – శ్రీకాకుళం కల్చరల్




**టిడ్కో ఇళ్లల్లో కార్డెన్ సెర్చ్**

పాత్రునివలసలోని టిడ్కో ఇళ్లల్లో శనివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నివాసాల్లో ద్విచక్ర వాహనాలకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో టౌన్ సీఐ సన్యాసినాయుడు, రూరల్ ఎస్ వాసుదేవరావు, వన్ టౌన్ ఎస్ఐ కామేశ్వరావు, సిబ్బంది పాల్గొన్నారు. –శ్రీకాకుళం రూరల్



**హరినామ సంకీర్తన**

నగరంలోని కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వామి కమిటీ సభ్యులు శనివారం నగరవీధులలో హరినామ సంకీర్తనలు ఆలపించారు. ఆలయ అర్చకులు వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. –శ్రీకాకుళం కల్చరల్